అంగన్‌వాడీ కేంద్రంలో పైపులు ధ్వంసం

విశాలాంధ్ర-జామి : మండలకేంద్రమైన జామిలోని అల్లువీదిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం(10)లోని వాటర్ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసారు. మంగళవారం కేంద్రాన్ని తెరిచిన టీచర్ చిప్పాడ కృష్ణవేణి బాత్‌రూంలో నీటి సరఫరా రాకపోవడంతో కేంద్రం వెనుకవైపు పరిశీలన చేసారు. అక్కడ పైపులను ఇష్టానుసారంగా కట్ చేసి వుండడంతో వెంటనే ఆమె సూపర్‌వైజర్ డి.సునీతకు సమాచారం అందించారు. ఆమె సూచన మేరకు జామి పోలీసులకు కృష్ణ వేణి ఫిర్యాదు చేసారు.

అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ విజేత భానుప్రసాద్‌కు ఎమ్మెల్యే అభినందన

విశాలాంధ్ర-బొబ్బిలి : అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగు విజేతగా నిలిచిన దీసరి భాను ప్రసాద్‌ను ఎమ్మెల్యే ఆర్‌విఎస్‌కేకే రంగారావు (బేబీ నాయన) సన్మానించారు. ఈనెల 4నుంచి 7వ తేదీలలో నేపాల్‌లోని ఎస్‌బికెయఫ్ ఇంటర్నేషనల్ గేమ్స్‌లో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నాడు. 83-220 కేజీల విభాగ పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీ నాయన మంగళవారం బొబ్బిలి కోట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రీడాకారుడిని అభినందించి సన్మానించారు. భానుప్రసాద్ తల్లిదండ్రులు పట్టణం గొల్ల వీధికి చెందిన సాధారణ కుటుంబం చెందినవారు.గత నెల స్థానిక ఎమ్మెల్యే ఆర్‌విఎస్‌కేకే రంగారావు (బేబీ నాయన) క్రీడాకారుడిని ఖర్చుల నిమిత్తం రూ.20 వేల చెక్కును అందజేశారు. ఈయన పట్టణంలో మై జిమ్ కోచ్ కేతిరెడ్డి సాయివరుణ్, శంబంగి పురుషోత్తం నేతృత్వంలో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీ నాయన మాట్లాడుతూ తన ఆట ప్రదర్శనతో దేశానికి అపారమైన కీర్తిని ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న క్రీడాకారుడు భానుప్రసాద్ అని కొనియాడారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఎమ్మెల్యే బేబీ నాయన అన్నారు.ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటుగా క్రీడలలోనూ రాణించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం మై జిమ్‌కి చెందిన కేతిరెడ్డి సాయివరుణ్, శంబంగి పురుషోత్తం, ముగడ శంకర్ యాదవ్ తంగుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్ల వివాహానికి బేబీ నాయన రూ.10 వేల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-వంగర : మండలంలో కొండ చాకరాపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబంలో జన్మించిన ఒకామెకు బొబ్బిలి రాజు బొబ్బిలి శాసనసభ్యులు బేబీ నాయన పెండ్లి నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సహాయం చేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గ శాసన సభ్యులు ఆయన ఆయన రూ.10 వేలు అందజేసి సహాయం చేశారు. మండలం కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన పేద కుటుంబం జోగరావు విజయ దంపతులకు జన్మించిన కుమార్తె వివాహం నిమిత్తం ఈ నిధులను ఆయన అనుచరుడు ద్వారా కొండ చాకరా పల్లి గ్రామానికి పంపించారు. ఈమేరకు అనుచరుడు మూడడ్ల శ్రీనివసరావు ఈ రూ.10,000 యల ఆర్థిక సహయం ను గ్రామ పెద్దలు టీడీపీ యువ నాయకులు బెవర భాస్కరరావు, బెవర శ్రీనివాసరావు ద్వారా ఆ పేద కుటుంబానికి కుమార్తె వివాహ నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బెవర శ్రీనువాసరావు, బెవర భాస్కర్‌రావు, బేబి నాయున అభిమాని అనుచరుడు మూడడ్ల శ్రీనువా సరావు పెండ్లకుమార్తె తండ్రి పుట్ట జోగారావు, విజయ తదితరులు ఉన్నారు.

కోర్టు ఆవరణలో వాహనాల పార్కింగ్ షెడ్డు ఏర్పాటు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు తమ సొంత నిధులతో వాహనాల పార్కింగ్ షెడ్డును ఏర్పాటు చేసుకున్నారు. ఈ షెడ్డును న్యాయవాదుల సంఘ అధ్యక్షులు జి.సూరిదేముడు, కార్యదర్శి బీవీఎస్ రామారావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సూరిదేముడు మాట్లాడుతూ న్యాయవాదులు సమకూర్చిన రూ.60వేల నిధులతో ఈ షెడ్డు నిర్మాణం ఏర్పాటు చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు న్యాయవాదుల వాహనాలు ఎండకు ఎండి వానకు తడుస్తుండేవని, షెడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ఇకపై వాహనాలను షెడ్డులో నిలుపుదల చేసుకోవచ్చున్నారు. ప్రస్తుతం ఈ షెడ్డులో న్యాయవాదుల ద్విచక్ర వాహనాలు మాత్రమే పార్కింగ్ చేసుకునే వెసులుబాటు ఉందని, ఇకముందు కక్షి దారుల వాహనాల పార్కింగ్ షెడ్డు నిర్మాణానికి కూడా కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.దుర్గాప్రసాద్, బి.త్రిమూర్తులు, డబ్ల్యు.ఎస్. శర్మ, వారాది ఈశ్వరరావు, టీవీఆర్ మూర్తి, బి.వెంకటరావు, బడబళ్ల రామకృష్ణ, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, జి.చిట్టిబాబు, ఎల్.అప్పారావు, శేఖర్, పిడిది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో చీపురుపల్లి ఖ్యాతిని పెంచాలి

క్రీడాకారులను సత్కరించిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-చీపురుపల్లి : క్రీడాకారులు తమ క్రీడలతో చీపురుపల్లి ప్రాంతానికి అంతర్జాతీయ ఖ్యాతిని కలిగించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం నాడు చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గరివిడి పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులను సత్కరించారు. గరివిడి పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన లేటు రాజమహంతీ దివాకర్ పట్నాయక్ కుమార్తె రాజ మహంతి రమణి ప్రియ బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదువుతూ, పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ అవుతూ ప్రస్తుతం గరివిడి కి చెందిన రాయల్ జిమ్ ఓనర్ గణపతి రాజా శ్వేతా వారి ప్రోత్సాహంతో మాస్టర్ వైవి ప్రసాద్ సారథ్యంలో శిక్షణ పొందుతూ క్రీడల్లో ఎన్నో విజయాలు సాధించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను దుస్సాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు ఇప్పిలి అనంతం, మీసాల వరహాల నాయుడు, రేవల్ల సత్తిబాబు, కుర్రోతు రమణ, పాండ్రికి రాము, డి.రాము, గవిడి సురేష్ కర్రోతు ప్రసాద్, ప్రభాత్ కుమార్, అస్సాం కృష్ణ, నాగచైతన్య, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కేసు నమోదు చేసిన వల్లంపూడి ఎస్సై బొడ్డు దేవి

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని బల్లంకి గ్రామానికి చెందిన మారడబూడి రమణ(34) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కేసు నమోదు చేసినట్లు వల్లంపూడి ఎస్సై బొడ్డు దేవి తెలిపారు. ఈ మేరకు కుటుంబీకులు గ్రామస్తులు అందించిన వివరాలు ప్రకారం మృతుడు మారడభూడి రమణ గ్రామానికి చెందిన మారడబూడి ఎల్లమ్మ, మారడబూడి కృష్ణవేణి, కనితి దారప్పలతో కలిసి అదే గ్రామానికి చెందిన కొత్తల శ్రీను పాసింజర్ ఆటో నెంబర్ ఏపి.31టి.హెచ్ లో సోమవారం పూసపాటిరేగ మండలం గోవిందపురం గ్రామంలో గల బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా రాత్రి 8 గంటల సమయంలో బల్లంకి గ్రామానికి సమీపంలో గల గుమ్మిడి బంధ వద్దకు వచ్చేసరికి ఆటో నడుపుతున్న డ్రైవర్ శ్రీను అజాగ్రత్తతో ఆటోను వేగంగా నడపడం వలన ఆటోను అదుపు చేయలేకపోవడంతో బోల్తా కొట్టిందని,ఆటోలో ఉన్న మారడబూడి రమణ,కింద పడడంతో తలకు బలమైన గాయం అవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు రమణతో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు చిన్న చిన్న దెబ్బలు తగిలాయని ఆ సమయంలో జామి గ్రామంలో ఉన్న నాకు ఫోన్ చేసి చెప్పారని వెంటనే అక్కడ నుండి బయలుదేరి గ్రామానికి చేరుకునే సరికి నా భర్త అయిన రమణ చనిపోయి ఉండటం చూసానని మృతుడు భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.అలాగే మృతుడికి ఒక కుమార్తె కుమారుడు ఉన్నారు.కాగా ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే నా భర్త ప్రాణాలు పోయాయని ఆటో డ్రైవర్ కొత్తల శ్రీనుపై చర్యలుతీసుకోవాలనిమారడబూడి దేవి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలను ఎంఈఓ సందర్శన

విశాలాంధ్ర-తెర్లాం : విద్యా సంవత్సరంలో ప్రభుత్వ స్కూల్స్‌లో విద్యార్థుల ప్రవేశాలు అధికం చేయాలనే ఉద్దేశ్యంతో తెర్లాం మండలంలో 5 వయస్సు గల పిల్లలు ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఎంఈఓ జే.త్రినాధరావు సందర్శించడం జరిగింది. దీనిలో భాగంగా అంగన్వాడి క్లస్టర్‌వారిగా అంగన్వాడి సిబ్బందిని కలిసి అందరూ 50మంది విద్యార్థులు తప్పక సమీప ప్రాథమిక పాఠశాలలలో చేర్పించాలని కోరడం జరుగుచున్నది. అదేవిధంగా మంగళవారం కుమ్మరిపేట అంగన్వాడి కేంద్రం సందర్శించి సదరు కేంద్రంలో గల 5ం వయసు గల పిల్లలను సమీప ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని కోరడం జరిగింది. అదేవిధంగా మండలంలో గల 88 అంగన్వాడి కేంద్రాలలోగల 5ం వయసు విద్యార్థులను సమీపంలోగల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలలో చేర్పించాలని అంగన్వాడీ కార్యకర్తలను కోరడమైనది అని ఎంఈఓ జే.త్రినాదరావు మంగళవారం విలేకర్లతో తెలిపారు.

వెయ్యి రోజుల సంరక్షణతో బిడ్డకు ఆరోగ్యం

విశాలాంధ్ర-గుర్ల : వెయ్యి రోజుల సంరక్షణతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు నిండు నూరేళ్ల జీవితాన్ని ఇచ్చిన వాళ్లమవుతామని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఆరుద్ర అన్నారు మండల కేంద్రంలో వారి కార్యాలయంలో అంగన్వాడి కేంద్రాల కార్యకర్తల ఆధ్వర్యంలో సంయుక్త పోషణ పక్వాడ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెయ్యి రోజులు తల్లి బిడ్డ సంరక్షణ కోసం గర్భిణీలను, బాలింతలను ఓటీఆర్ ద్వారా నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్స్ శకుంతల, రాధిక, జ్యోతి, శుభ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహానికి వితరణ

విశాలాంధ్ర-చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురం శివరాం రోడ్డులో నివసిస్తున్న జరజానా అచ్చుతరావు కుమార్తె పెళ్లి సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ దుర్గమల్లేశ్వరి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 50 వేల రూపాయల విలువగల సామాగ్రిని మంగళవారం వితరణగా అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ చీపురుపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బి సి సెల్ అధ్యక్షులు మరియు కుమరం గ్రామ సర్పంచ్ ప్రతినిది ముళ్ళు రమణ 50000/-రూపాయలు విలువ గల ఫ్రిజ్, ఎల్ఈడి టీవీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గా మల్లేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈసందర్భంగా ఆయన వివరించారు.

ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు



విశాలాంధ్ర-కొత్తవలస : జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు-2025లో భాగంగా కొత్తవలస అగ్నిమాపక అధికారి వై.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో కొత్తవలస పిఎంఎల్ కాంప్లెక్స్ వద్ద మంగళవారం నిర్వహించిన అగ్నిమాపక విన్యాసాలు, మాక్ డ్రిల్ వంటి కార్యక్రమాలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి. వివిధ రకాల అగ్నిమాపక పరికరాలు ఎఫ్ఎంబి 5ఎక్స్, ట్రిపుల్ పర్పస్, ఫాగ్ డిఫ్యూజర్, రివాల్వింగ్ బ్రాంచ్ పైపులు వంటి వినియోగంపై ప్రజలకు డెమో ద్వారా అవగాహన కల్పించారు. స్థానికులకు కరపత్రాలు పంపిణీ ద్వారా అగ్నిమాపక అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో శారద పరిశ్రమ సేఫ్టీ హెడ్ పద్మాకర్, శారద ఇండస్ట్రీస్ ఫైర్ ఆఫీసర్ రాజశేఖర్, ఎల్.ఎఫ్ లు కనకారావు, శివకృష్ణ, కొత్తవలస అగ్నిమాప కేంద్ర సిబ్బంది, శారద ఇండస్ట్రీ అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ్‌పై అవగాహన



విశాలాంధ్ర-కొత్తవలస : పోషణ పక్వాడ్ పక్షోత్సవాలలో భాగంగా కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామంలోగల 1,2,3,4 అంగన్వాడీ కేంద్రాలలో మంగళవారం గర్భిణీలకి, బాలింతలకి, పిల్లల తల్లులకు పోషణ పక్వాడ్ పై వియ్యంపేట ఐసిడిఎస్ ఏసిడిపిఓ లక్ష్మీభాయి, సూపర్వైజర్ స్వర్ణలత అవగాహన కల్పించారు. 1000 రోజుల సంరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణీ గర్భం ధరించిన దగ్గర నుండి ప్రసవం అయినంత వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి, అలాగే పుట్టినప్పుడు నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికి బరువులు, ఎత్తులు ప్రతి నెల తుయించాలని, తుయించడం వలన బరువు తక్కువ పిల్లల అంటే ఎస్ఏఎం, ఎంఏఎం , ఎస్యుడబ్ల్యు పిల్లలని గుర్తించి ఎన్ఆర్సికి రిఫర్ చేయవచ్చని, 6 నెలలు కేవలం తల్లిపాలు పట్టాలని, 6 నెలలు నిండిన తరువాత అదనపు ఆహారం అందించాలని, పోషణ ట్రాకర్ యాప్ గురించి, విహెచ్ఎన్డి సమయంలో లబ్దిదారుల నమోదు గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు గంగేశ్వరి, వాహిని, బాపయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో అక్కునాయుడు అరెస్ట్

విశాలాంధ్ర-రామభద్రపురం : జనసేన నాయకుడు మహంతి ధనంజయపై హత్యాయత్నం చేసిన అక్కునాయుడును బుధవారం అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించామని బొబ్బిలి డివిజన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ భవ్య రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆమె తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో మెయిన్ రోడ్‌లో పశువుల ఆసుపత్రివద్ద ఉన్న 20 సెంట్లు భూవివాదమే ఈ హత్యయత్నానికి కారణమని అన్నారు. కోర్టులో కేసు పెండింగ్ ఉంటుండగా అక్కునాయుడు ఆ స్థలం వద్ద పళ్ళుకొట్టు పెట్టాడు. జనసేన నాయకుడు ధనుంజయ ఆస్థానంలో పళ్ళు కొట్టు ఎందుకు పెట్టావ్ అని పలుమార్లు అక్కునాయుడును ప్రశ్నించాడు. ఈవిషయంలో ధనంజయపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే ధనంజయను హతమారిస్తే సమస్య పరిష్కారం అవుతుందని అక్కునాయుడు భావించాడు. ఆదివారం రాత్రి 7గంటల ప్రాంతంలో వసంతల వీధి రామమందిరం వద్ద ధనంజయ కొరకు ఆటోలో బొండాలు నరికే కత్తితో మాటువేశాడు. ధనంజయ ఇల్లు కూడా సమీపంలో ఉండడంతో అక్కడి నుండి వస్తున్న ధనంజయపై ఒక్కసారిగా తలపైన, మెడపైన, చేతులపైన కత్తితో గాయపరిచాడు. అక్కడే ఉన్న స్థానికులు ఈ ఘటన చూసి ధనుంజయను బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి ప్రాథమిక వైద్యం కొరకు తరలించారు. అక్కడ డాక్టర్లు ప్రాథమిక వైద్యం చేసి మరింత మెరుగైన వైద్యం కొరకు విజయనగరం తిరుమల హాస్పిటల్ తరలించారు. ఈదాడికి పాల్పడిన అక్కునాయుడును అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు. అక్కునాయుడుకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ నారాయణరావు, ఎస్సై వెలమల ప్రసాదు, ఏఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ఆధునిక ఆడిటోరియం నిర్మించండి : భీశెట్టి బాబ్జి

జేసికి పౌరవేదిక బృందం వినతి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : విజయనగరం జిల్లా కేంద్రంలో ఉన్నత స్థాయి కళాప్రదర్శనల కోసం ఆధునిక ఆడిటోరియం ని నిర్మించాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షుడు ఎస్. సేతు మాధవన్ ని కోరారు. మంగళవారం పౌరవేదిక బృందం తో కలిసి వినతిపత్రం అందచేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విజయనగరం జిల్లా కళలకు నిలయం అని ప్రసిద్ధి చెందినా ఆ స్థాయిలో కళాకారులకు,ప్రేక్షకులకు తగిన వసతులు లేవని గురజాడ గ్రంధాలయం ఆవరణలో ఉన్న గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియం లో ప్రేక్షకులు ప్రదర్శనలు తిలకించే టప్పుడు,వర్షాకాలంలో తడుచుకుంటు, చలికాలంలో మంచులో కూర్చొని ఇబ్బందులు పడుతూ ప్రదర్శనలు తిలకిస్తున్నారని నగర కార్పొరేషన్ కమిషనర్‌కి జేసి తగిన ఆదేశాలు జారీచేసి సుమారు ఐదు వందలమంది ప్రేక్షకులకు ఇబ్బందులు లేని విధంగా షెడ్డు నిర్మించాలని కోరామని భీశెట్టి తెలిపారు. ఆనంద గజపతి ఆడిటోరియం కూడా అరకొర వసతులతో మౌలిక సదుపాయాలు లేక కళాకారులు, కళాభిమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చొరవ తీసుకుని విజయనగరం జిల్లా కేంద్రంలో వెంటనే ఆధునిక ఆడిటోరియం కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు, జిల్లా పౌర వేదిక ద్వారా జిల్లాలోని అందరు ఎమ్మెల్యేలకి, ఎంపికి లేఖలు రాస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, కార్యదర్శి తుమ్మ గంటి రాంమోహన్ రావు,ఇప్పలవలస గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలు... నేల మట్టమైన పంట

- లబోదిబోమంటున్న రైతులు
- సుమారు 7ఎకరాల పంట నేల మట్టం

విశాలాంధ్ర-మెంటాడ : ఎండవేడికి అల్లాడిపోతున్న సమయంలో వచ్చిన అకాల వర్షానికి సంతోషించాలో అకాల వర్షాల వల్ల పంట దెబ్బతిన్నందుకు బాధపడాలో తెలియక అయోమయంలో రైతులు వేదన. మండలంలో పెద్ద మేడ పల్లి గ్రామంలో కురిసిన అకాల వర్షం వల్ల సుమారు ఏడు ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు అధికారిక ప్రకటన చేశారు. మొక్కజొన్న నాలుగు ఎకరాలు, బీట్ రూట్ 1.1/2 ఎకరం, చిక్కుడు ఒక ఎకరం తదితర పంటలు నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మామిడి, జీడి మామిడి పంట నేల రాలినట్లు రైతులు తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పందించి ప్రకృతి వైపరీత్యం వలన జరిగిన ఈ ఘటనకు అంచనా వేసి నష్టపలహారం ఇప్పించాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిటిసి రెడ్డి ఎర్నాయుడు సంబంధిత పంట పొలాలను దర్శించి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షం వలన రైతులు సుమారు పెట్టుబడి మూడు లక్షల వరకు కోల్పోయారని చేతికి అందే తరుణంలో ఈ విధంగా పంట నష్టపోవడం బాధాకరమైన విషయమని దీనిపై స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్ మండలానికి నివేదిక సమర్పించి బాధితులను ఆదుకునేలా ప్రయత్నించాలని కోరారు. అనంతరం కన్నీరు మున్నేరు అవుతున్న రైతులను తక్షణం ఆదుకునేలా తన ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

జామి ఎస్ఐ వీరజనార్ధన్‌కు గోసంరక్షణ సమాఖ్య సత్కారం

విశాలాంధ్ర-జామి : స్థానిక జామి సబ్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వీర జనార్ధన్ ఆదర్శప్రాయుడు అని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్.ఐ. జనార్ధన్‌కు పూల మాల వేసి శాలువా కప్పి గోమాత మేమెంటో ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో లొట్లపల్లి పశువుల సంత పశుమాంస వ్యాపారులకి, అడ్డాగా మారిందని చట్టాలు కసాయి వారి చుట్టలుగా మార్చారని ఈ సమయంలో ఎస్. ఐ. వీర జనార్ధన్ అత్యంత దైర్య సాహసాలుతో ఈ ఏడాదిలో 20కి పైగా గోవుల అక్రమ రవాణా వాహనాల పైన, కసాయి వారి పైన కేసులు పెట్టడం వందలాది గోవులను రక్షించారని ఇందుకు ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య అభినందిస్తుంద న్నారు. ఎస్.ఐ.వీర జనార్ధన్‌ను మిగతా అధికారులు అందరు ఆదర్శంగా తీసుకోవాలి అన్నారు. అదే స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఈశ్వరరావు జంతు సంరక్షణకు ఎంతో కృషి చేస్తున్నందున గోమాత మేమెంటో ఇచ్చి సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్.ఐ.జనార్ధన్ మాట్లాడుతూ జంతు సంరక్షణ చట్టాలను అమలు చేయడానికి తన శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.వి.ఆర్.సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి. రవి శంకర్, జిల్లా మహిళా కార్యదర్శి నీలాపు దేవి, జిల్లా కమిటీ సభ్యులు వేమలయమున, కేత జీవన, తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల సంరక్షణతో బిడ్డకు ఆరోగ్యకరమైన నిండు నూరేళ్ల జీవితం

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : ఏప్రిల్ నెల 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరుగుతున్న పోషన్ పక్వాడా కార్యక్రమాలలో భాగంగా మంగళ వారం వి.టీ అగ్రహారం హై స్కూల్ లో వెయ్యి రోజుల సంరక్షణ, నవచేతన కార్యక్రమాల పై ర్యాలీ ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. గర్భిణీ దశ నుండి బాలింత దశ,పిల్లల రెండు సంవత్సరాలు వచ్చేవరకు జరిగే వెయ్యి రోజులు సంరక్షణ సున్నా నుంచి మూడు సంవత్సరాలు వరకు పిల్లలకు సంరక్షణ గూర్చి నవ చేతన అనే కార్యక్రమం గురించి వివరించడం అయింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ మాట్లాడుతూ ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ పుట్టి బిడ్డకు రెండు సంవత్సరాల వచ్చేవరకు జరిగే అన్ని కార్యక్రమాలలో మంచి ఆహారము, మంచి ఆరోగ్య పద్ధతులు పాటించడం బిడ్డ పుట్టిన వెంటనే ముర్రి పాలు తాగించడం సకాలంలో బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం, మరలా బిడ్డకు ఏడవ నెల వచ్చిన దగ్గరనుంచి తల్లిపాలను కొనసాగిస్తూ అనుబంధ పోషకాహారాన్ని అందిస్తూ రెండు సంవత్సరాల వరకు రావలసిన మైలురాళ్లన్నీ బిడ్డ సకాలంలో అభివృద్ధి చెందినట్లయితే ఇక బిడ్డ భవిష్యత్తులో కుటుంబానికి సమాజానికి మంచి పౌరునిగా నిలబెడతాడని అందువలన ఈ కాలాన్ని 1000 రోజులు సంరక్షణ అని తెలియజేశారు. గర్భిణీ స్త్రీ గృహాన్ని సందర్శించి ఆమె సకాలంలో తీసుకోవాల్సిన ఆహారం, జీవన శైలి విధానం గురించి తెలియజేశారు. అదేవిధంగా ఏడవ నెల నుంచి బిడ్డ తీసుకోవాల్సిన అదనపు ఆహారాన్ని గూర్చి ఆరు నెలలు నిండిన బాలింత గృహాన్ని సందర్శించి అనుబంధ పోషకాహారాన్ని గూర్చి వివరించడం జరిగింది. ఈ సంవత్సరం పోషణ అభియాన్ పోషణ పక్వాడా కార్యక్రమం లో నాలుగు థీమ్స్ కలిగి ఉన్నాయి. వెయ్యి రోజుల సంరక్షణపై శ్రద్ధ వహించుట, లబ్ధిదారులు తమంతట తామే పోషణ ట్రాకర్ లో నమోదు చేసుకున్న విధానం పట్ల ప్రచారం చేయుట, కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం అమలుచేయడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపం నివారించుట, పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకునేలా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ఎన్.కే.ఆర్ పురం హైస్కూల్ హెచ్ఎం సిహెచ్ వెంకట్రావు

విశాలాంధ్ర-వేపాడ : కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను నేర్పించడం జరుగుతుందని కావున చదువుకునే ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని నీలకంఠ రాజపురం జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం చోడవరపు వెంకటరావు అన్నారు. మండలంలోని నీలకంఠ రాజపురం గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కూలీలు పనిచేస్తున్న పని ప్రదేశం దగ్గరకు మంగళవారం వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని మీ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించి మీరు కాయ కష్టంతో సంపాదించే సొమ్మును వృధా చేయకుండా ప్రభుత్వం విద్య సంక్షేమానికి అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహనకు చేపల కంచేరులో నేడు మాక్ డ్రిల్

విశాలాంధ్ర-భోగాపురం : తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే విషయమై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో భోగాపురం మండలం చేపల కంచెరులో ఏప్రిల్ 16వ తేదీ ఉదయం 9 గంటలకు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్టు విపత్తు నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ అధికారి ఎం.రాజేశ్వరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనలతో చేపల కంచేరు గ్రామంలోని సచివాలయం వద్ద గల ఎం.పి.యు.పి. స్కూల్ ఆవరణలో బుధవారం అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీ ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలతో ప్రజలకు విపత్తులను ఎదుర్కొనే విషయమై తగిన అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

అంగన్వాడీ కేంద్రాలలో పోషణ్ పక్వాడపై అవగాహన

విశాలాంధ్ర-లక్కవరపుకోట : మండలంలోని రంగారాయపురం గ్రామంలో మంగళవారం అంగన్వాడి 1వ కేంద్రంలో పోషన్ పక్వాడ వారోత్సవాలు భాగంగా పిల్లలకు, తల్లులకు అవగాహన కార్యక్రమం నర్వహించడం జరిగిందని సూపర్వైజర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిడ్డల బరువు, పెరుగుదలకు తగిన సలహాలు, సంప్రదింపులు ఇవ్వడం జరిగిందని పౌష్టికాహారం ఏ విధంగా అందించడం తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు వచ్చే ఆహారాన్ని ఎలా తయారు చేయాలి, తెలియజేయడం జరిగిందన్నారు ఎన్ఆర్సికి రెఫర్ చేయమని చెప్పడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జి.శేషుకుమారి పాల్గొనడం జరిగింది.

పద్మశాలి కుటుంబాలను ఐక్యం చేయాలి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి కోవెల ఆవరణలో రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం పెద్దలు తెడ్ల వెంకటేశ్వర రావు, పప్పు రాజారావు, ఆదేశానుసారం విజయ నగరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు జి రాము, జిల్లా యువజన అధ్యక్షులు సప్ప ప్రసాద్, అధ్యక్షతన పద్మశాలి సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో గల తీర్మానాలు విజయనగరం జిల్లా మొత్తం పర్యటించి పద్మశాలి కుటుంబాలను ఐక్యం చేయడంతో పాటు మండల కమిటీలు, నియోజవర్గ కమిటీలు, వెయ్యాలని, అలాగే జిల్లా కమిటీ కూడా వెయ్యాలని నిర్ణయించడం జరిగింది. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి నాల అప్పారావు, కోశాధికారి కే. చిరంజీవి, ఉపాధ్యక్షులు టి.ఏ. నారాయణ, అడ్వైజర్ సత్యనారాయణ,సహాయ కార్యదర్శి అప్పలరాజు, సభ్యులు త్రినాధ్, ఎస్.సత్యం, వి రాజు,సిహెచ్ శంకర్, బి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీపైడితల్లి అమ్మవారి దేవరా మహోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : విజయనగరం పట్టణములో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం ఆంధ్రప్రదేశ్లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన దేవాలయము. సత్యం గల అమ్మవారు. సిరులిచ్చే దేవతగాను, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగాను భక్తకోటికి కొంగుబంగారమై వెలసింది. అట్టి పసిడి కాంతుల శ్రీ పైడితల్లి అమ్మవారి దేవరా మహోత్సవ ఊరేగింపు తే.12-05-2025 దీ సాయంత్రం గం.4-00లకు పసంగుడి నుండి బయలుదేరి గంటస్తంభం మీదుగా హుకుంపేట చేరును. తిరిగి రాత్రి గం.10-00 లకు హుకుంపేటలో గల శ్రీఅమ్మవారి చదురు వద్ద నుండి తే 13-05-2025ది మంగళవారం ఉదయానికి మూడులాంతర్ల వద్దగల చదురుగుడికి శ్రీ అమ్మవారు వేంచేస్తారు. అప్పటి నుండి ఉయ్యాలకంబాల ఉత్సవము వరకు శ్రీఅమ్మవారు చదురుగుడిలో కొలువై ఉందురు.

19న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-కొత్తవలస : కొత్తవలస మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19వ తేదీన ఎంపీపీ నీలంశెట్టి గోవమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కొత్తవలస ఎంపీడీఓ వి.రమణయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 25గ్రామ పంచాయితీలకు చెందినా సర్పంచులు, ఎంపీటీసి సభ్యులు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి సామూహిక రాయబారం

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి మండలం కర్లాం గ్రామంలోగల శ్రీవెంకట రామ పౌల్ట్రీస్ కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 16న సామూహిక రాయబారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్మిక సంఘాల ప్రతినిధులు మంగళవారం చీపురుపల్లిలో విలేకరులకు తెలిపారు. పౌల్ట్రీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 8వ తేదీ నుంచి నిరసన తెలియజేస్తున్నప్పటికీ యాజమాన్యం కనీసం పట్టించుకోకపోవడంతో ఇటువంటి కార్యక్రమాల్ని చేపడుతున్నట్లు కార్మికులు వివరించారు. అక్రమంగా తొలగించిన కార్మికులందరినీ డిసిఎల్ డైరెక్షన్కు లోబడి విధులకు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక యువకులకే 75% ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఈ మేరకు స్థానిక శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు కార్యాలయం వరకు సామూహిక రాయబారం (పాదయాత్ర) కార్యక్రమాన్ని చేపడుతున్నామని వారు వివరించారు.న్యాయ మైన సమస్యలు పరిష్కారానికై కార్మికులు చేస్తున్న ఈ పోరాటానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు అందరూ మద్దతు తెలియజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను నిరసన తెలియజేస్తున్న టెంటు వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టివి రమణ, ఏ.గౌరినాయుడు, ఐ.గురునాయుడు, టి. ఈశ్వరరావు, సూరిబాబు, గొల్లబాబు, తదితర కార్మికులు పాల్గొన్నారు.

23న గవరపాలెంలో శ్రీసీతారాముల ఆలయ ప్రతిష్ట

విశాలాంధ్ర-కొత్తవలస : కొత్తవలస మేజరు పంచాయితీ పరిధిలోని గవరపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసిద్ధిబుద్ధి మహాగణపతి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర, శ్రీఅభయాంజనేయ, శ్రీసీతారామ స్వామి వార్ల ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ఏప్రిల్ 20 నుంచి 23వ తేదీ వరకు శ్రీసీతారామ గౌరీ సేవా సంఘం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. 20న గణపూజతో ఉత్సవాలను ప్రారంభించి 21,22న ప్రత్యేక పూజలు, హెూమాలు, 23న స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉత్తరాయణ చైత్ర బహుళ దశమి బుధవారం ఉదయం 10గం. 44ని.లకు శతభిషా నక్షత్రయుత మిధున లగ్నమందు శ్రీ సిద్ధిబుద్ధి మహాగణపతి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీ అభయాంజనేయ, శ్రీసీతారామ స్వామి వార్ల విగ్రహ.. ఆలయ.. శిఖర.. ప్రతిష్ఠలు బ్రహ్మశ్రీ శతాధిక దేవతా ప్రతిష్ఠాపనాచార్య త్రివేద పండితులు కప్పగంతుల ప్రసాదశర్మచే గ్రామ పురోహితులు, వేదపండితులు వేలమూరి శ్రీరామమూర్తి పర్యవేక్షణలో కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాఅన్నదానం, పలు సాంస్కృతిక, భక్తి కార్యక్రమాలు ఉంటాయాన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

వర్షంతో ప్రజల్లో ఆనందం

విశాలాంధ్ర-రాజాం : రాజాంలో మంగళవారం మధ్యాహ్నం ఒకేసారి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. తీవ్రమైన ఎండతో బాధపడిన ప్రజానీకానికి, మధ్యాహ్నం ఒకేసారి మారిన వాతావరణం తో ఉపశమనం కలిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విపరీతమైన ఎండ . ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. రోడ్లమీదకు కూడా రాలేని పరిస్థితి. ప్రజలంతో ఇబ్బంది పడుతున్న సమయంలో ఒకేసారి మధ్యాహ్నం 3 గంటల నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. భారీ వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో వాన పడింది. దీంతో ఎండకు ఉపశమనం కలిగిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

బాగిరేతమ్మ పేరంటాలని దర్శించుకున్న డాక్టర్ రాజేష్

విశాలాంధ్ర-రాజాం : రాజాం రూరల్ ఓమ్మి గ్రామంలో భాగిరేతమ్మ పేరంటాల పండగ కార్యక్రమంలో పాల్గొని భాగిరేతమ్మ తల్లి ఘటాలకు నమస్కరించి పూజా కార్యక్రమాలు నిర్వహించిన రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా.తలే రాజేష్ ఈకార్యక్రమంలో రాజాం రూరల్ పార్టీ అధ్యక్షులు లావేటి రాజగోపాల్ నాయుడు, జడ్పీటీసీ బండి నరసింహులు, గ్రామ వైఎస్ఆర్సీపీ నాయకులు శ్రీనివాసరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పోషన్ పక్వాడా పక్షోత్సవాలు కార్యక్రమం

వెయ్యి రోజుల సంరక్షణతో మాత్రమే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇవ్వగలమని ఐసిడిఎస్ సూపర్వైజర్ జె. లక్ష్మి వెల్లడి

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో ఉత్తరావిల్లి అంగన్వాడి నాలుగు సెంటర్లలో మరియు బుధ రాయవలస మూడు సెంటర్లలో ఈనెల 8 నుండి నిర్వహిస్తున్న పోషన్ పక్వాడ పక్షోత్సవాలు కార్యక్రమం లో భాగంగా సంయుక్త పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ జె. లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఓ పండగ వాతావరణం లా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ మాట్లాడుతూ వెయ్యి రోజుల తల్లి బిడ్డల సంరక్షణ కోసం గర్భిణీ బాలింతలకు ఓటిఆర్ ద్వారా నమోదు చేయడం, బిడ్డకు వ్యాధినిరోధక శక్తి కోసం ఐరన్,కాల్షియం మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. ఇంటిదగ్గర సమతుల్య ఆహారం తీసుకోవడమే కాకుండా, అంగన్వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారాన్ని కూడా తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు అంగన్వాడీ కేంద్రాల్లో ఎత్తు బరువులు చూసుకోవాలి అని అన్నారు. అంగన్వాడి కార్యకర్తలు,ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పోషకాహార ఆరోగ్య విద్య పై అవగాహన కల్పిస్తూ గృహ సందర్శనలు చేయాలని సూచించారు. ఇంటిదగ్గర కుటుంబ సభ్యుల సహకారం, ఆనందం అవసరాలు తప్పకుండా అందించాలన్నారు. అదే విధంగా బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు అందించడం, ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వడం, ఏడవ నెలకు అనుబంధ పోషకాహారం మొదలుపెట్టడం, ఏడు నుండి తొమ్మిది నెలల మధ్య ఆహార వైవిధ్యం, అదేవిధంగా 10 నుండి 12 నెలలు బిడ్డకు, 12 నుండి 24 నెలల బిడ్డకు ఎటువంటి ఆహారం రోజుకి ఎన్నిసార్లు కోటరీ రూపంలో ఇవ్వవలసిన అవసరాలు గురించి తల్లులకు సమావేశంలో అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరా వల్లి అంగన్వాడి కార్యకర్తలు టి. మాలతి, జె. జ్యోతి, టి లత,ఐ లోకేశ్వరి మరియు బుధ రాయవలస అంగన్వాడి కార్యకర్తలు ఎ. పార్వతి,డి మల్లీశ్వరి,ఎం గౌరమ్మ మరియు తల్లులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వర్షం... ఇళ్లల్లోకి ప్రవేశించిన నీరు... నిండిన పంట పొలాలు

విశాలాంధ్ర-వంగర : వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది.మంగళ వారం ఉదయం నుంచి ఎండ, చిన్న మబ్బులతోఉన్న మేఘాలు మధ్యాహ్నం 2 గంటలు అయ్యేసరికి తావరణం ఒక్కసారిగా మారిపోయింది. మేఘావృతమై ఏక ధాటిగాా౦ండు గంటలు వరకూ వర్షం ఇక్కడ దంచి కొట్టింది. దీంతోమురుగు నీటి కాల్వల ద్వారా నీరు బయటకు పోలేక ఇళ్లల్లోకినీరు ప్రవేశించి కొంతవరకూ ఇబ్బంది పెట్టింది. ఇంతవరకూ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నానికి వరుణుడు కరుణించి దంచి కొట్టటంతో ప్రజలకు ఎండ నుంచి ఉపశమనం లభించింది. అయితే ఈ అకాల వర్షాల కారణంగా అన్నదాతలు కొందరుఆందోళన చెందుతున్నా. మరికొందరు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నువ్వు తదితర పంటలకు నష్టం వాటిల్లినా, వరి, మొక్కజొన్న తదితర పంటలకు ఎంతో ఉపయోగంగా చెప్పక తప్పదు. మద్దువలస సెంటర్లో మురుగు

నీటికాల్వలు పూడికలతో నిండిపోవటంవల్ల దంచికొట్టిన వర్షం కారణంగా ఆ వర్షం నీరు ఇళ్లల్లోకి ప్రవేశించి ఇబ్బందులకు గురిచేసింది. మండలంలో అన్ని గ్రామాల్లో వర్షం కురిసినట్లు సమాచారం. మరోవైపు రానున్న మరికొన్ని రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. మే నెలలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపింది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఈ అనూహ్య మార్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దినం కురిసినవర్షంవల్ల ప్రజలు ఎంతో వేడిమి నుంచి ఎంతో ఉపశమనం కలిగిందని చెప్పాలి.

నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-సంతకవిటి/రాజాం : సంతకవిటి మండలం గోవిందపురం పంచాయతీ ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ బి.పద్మ యూనిట్ ఇన్చార్జి పాత్రుని వెంకటరమణ గ్రామ సర్పంచు రాగోల రమేష్,, పంచాయతీ సెక్రెటరీ రామారావు గ్రామ పెద్దలు రైతులు ఈ గ్రామ సభలో పాల్గొనడం జరిగింది. గ్రామ సభ ముఖ్య ఉద్దేశం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులు నవధాన్యాలు విత్తనాలు 12 కేజీలు పప్పు దినుసులు చిరుధాన్యాలు పచ్చిరొట్ట విత్తనాలు ఆకుకూరలు,కూరగాయలు ఒక ఎకరాకు 12 కేజీలు చొప్పున ఖరీఫ్లో వేసుకుంటే 45 రోజుల తర్వాత కలియ దున్నుకోవాలి వీటివలన నేల సారవంతం పెరుగుతుంది. పంటకు కావలసిన సూక్ష్మ స్థూల పోషకాలు లభిస్తుంది. ప్రకృతి వైపరీత్యాల్ని తట్టుకుంటుంది రైతులకు రసాయని వ్యవసాయానికి బదులు ప్రకృతి వ్యవసాయం చేయడం వలన పెట్టుబడులు తగ్గి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడంతో పాటు నేలతల ఆరోగ్యాన్ని కాపాడుకొని భవిష్యత్తు తరాల వారికి అందించడం జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన ఘనజీవమృతం, బీజమృతం, ద్రవ జీవమృతము, నియమాస్త్రము మొదలైనవి రైతులు పాటిస్తే పెట్టుబడులు తగ్గుతుంది దిగుబడి పెరుగుతుంది అని వివరించారు. గోవిందపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ఏర్పాటు చేయడానికి నిర్ణయించడం జరిగింది.

దెందేరులో రైతులకు పిఎండిఎస్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-కొత్తవలస : కొత్తవలస ప్రకృతి వ్యవసాయ సంస్థ ద్వారా దెందేరు గ్రామంలోని పలువురు రైతులకు మంగళవారం పిఎండిఎస్ కిట్లు పంపిణీ చేసినట్లు కొత్తవలస ఎపిఎం(ఎఫ్.పి.ఓ.) వెంకటరమణ తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నువ్వులు మరియు చిరుధాన్యాల పంటలో నవ ధాన్యాల పంట సాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కేజీన్నర(1.1/2) నవధాన్యాల (12రకాల విత్తనాలు) ప్యాక్ కేవలం రూ.100ల చొప్పున మొత్తం 125 కిట్లను రైతులకు అందజేసినట్లు వివరించారు. నువ్వులు చిరుధాన్యాల పంటతో నవధాన్యాలు విత్తనాలు కలిపి సాగు చేయడం వలన ప్రధాన పంటకు కావలసిన పోషకాలు అందుతాయని, ఎరువులు, పురుగుల మందులు వాడకం తగ్గుతుందని, భూమిలో తేమశాతం నిల్వ ఉంటుందని, సేంద్రీయ కర్బనం మెరుగు పడుతుందని, కుటుంభ అవసరాలకు ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవచ్చునని, పచ్చిరొట్ట పైర్లను పశుగ్రాశంగా ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కోటి బాబు, గ్రామ సంఘం అధ్యక్షురాలు ఎస్. వరలక్ష్మి, యూనిట్ ఇంచార్జ్ శ్రావ్య, విఓఏ సంతోష్ కుమారి, ఐసిఆర్పిలు వరలక్ష్మి, కోమలత, ఫార్మర్ సైంటిస్ట్ సాయిలక్ష్మి, మహిళా రైతులు హాజరయ్యారు.

3వ రోజు శ్రీరామరక్ష రథయాత్ర

- తోటాడ గ్రామం నుండి రథయాత్ర ప్రారంభం

విశాలాంధ్ర-మునగపాక: శ్రీరామరక్ష రథయాత్ర 3వ రోజు మంగళవారం మునగపాక మండలం గవర్ల అనకాపల్లి గ్రామంలో ప్రారంభమై తోటాడ, టి.సిరస పల్లి,నారాయుడుపాలెం,వెంకటాపురం,తిమ్మరాజుపేట గ్రామాలు రథయాత్ర కొనసాగింది.ప్రతి గ్రామాలను రామలక్ష్య రథయాత్రకు గ్రామాల్లో ప్రజలు హారతులు పట్టి శోభాయాత్రగా గ్రామాల్లో రామనామ స్మరణతో యాత్ర కొనసాగించారు. అధిక సంఖ్యలో భక్తులు అయోధ్య రామన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు ఆచరించారు. అయోధ్య నుండి వచ్చిన పండితులు భక్తులకు ఆశీర్వచనాలు ఇచ్చారు. పండితులు ఇచ్చిన నక్షత్ర హారతులతో భక్తులను ప్రతి గ్రామంలో ఆకట్టుకుంటుంది.ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ చైర్మన్ ఆనంద్ కుమార్, ఎలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి, బడే రవి, కలిదిండి శివాజీ బహదూర్, దాట్ల వర్మ, బోరవెల్లి ప్రమోద్ కుమార్, ద్వారపరెడ్డి పరమేశ్వరరావు,సమరసత సేవ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోన్ ధర్మ ప్రచారక్ గంగాధర్, నాగేశ్వరరావు, పప్పు ఈశ్వరరావు, తోటాడ, గవర్ల అనకాపల్లి, టి. సిరసపల్లి, వెంకటాపురం, నారాయణపేట, ఐ.తిమ్మరాజుపేట, పెదపాడు, జగ్గన్నపేట, కాజీపాలెం, ఆనందపురం, కుమారపురం గ్రామాల సర్పంచులు పాల సొసైటీల అధ్యక్షులు పెద్దలు కోలాటం బృందాలు, స్వామి గరిడీలు, చెట్టు భజనలు, హరి భజనలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నారా లోకేష్ చేతులమీదుగా లాప్టాప్ అందజేత

విశాలాంధ్ర - మెరకముడిదాం : మెరకముదుదాం మండలం ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో గర్భాం ఆదర్శ కళాశాల చెందిన విద్యార్థి తాడ్డి తనూజ స్టేట్ ఫస్ట్ ర్యాంకు బైపిసిలో అన్ 987 మార్కులతో సాధించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ స్టేట్, జిల్లా ర్యాంకులు పొందిన విద్యార్థులను గౌరవిస్తూ మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా లాప్టాప్, మెమొంటో మెడల్ ఇచ్చి తల్లిదండ్రులతో సన్మానించడం జరిగింది. మంగళవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదగా గర్భాం ఆదర్శ కళాశాల చెందిన తాడ్డి తనూజ స్టేట్ ఫస్ట్ ర్యాంకు బైపిసిలో 987 మార్కులతో రావడంతో సన్మానం పొందడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడాక విద్యలో ఎన్నో సంస్కరణ, మార్పులు చేసి విద్యార్థులకు ఆసరాగా ఉంటుంది అన్నదానికి ఇదే తార్కాణం.

సీడీపీఓ జాగాన ఆధ్వర్యంలో చేపట్టిన పోషణ పక్వాడ్ కార్యక్రమానికి విశేష స్పందన

విశాలాంధ్ర - బొబ్బిలి : మండలం పారాది అంగన్వాడీ సెంటర్ లో పోషన్ పక్వాడ్ కార్యక్రమం సిడిపిఓ జాగాన విజయలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి విశేష స్పందన ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు సీమంతా కార్యక్రమం తల్లులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు ప్రదర్శించిచారు..ఈ కార్యక్రమమునకు పారాది సెక్టార్ అంగన్వాడి వర్కర్స్ అందరూ. గ్రామ సర్పంచ్.ఎంపీటీసీ ఎక్స్ సర్పంచ్ భాస్కర రావు .తల్లులు. సెక్టార్ సూపర్వైజర్ ఎం సుబ్బలక్ష్మి. మహిళా పోలీస్. స్కూల్ హెచ్ఎం . స్కూల్ టీచర్స్ హాజరైరి.

భవననిర్మాణ అనుమతులుంటే చూపాలంటూ నోటీసు

విశాలాంధ్ర - కొత్తవలస : కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లి పంచాయితీ పరిధిలోని జగన్నాధం లేఅవుట్ లో నిర్మిస్తున్న జి3 భవనానికి సంబంధించి అనుమతులుంటే యజమాని పంచాయితీకి చూపించి తమ పనులు చేసుకోవాలంటూ యజమాని గోపీనాద్ కు పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్ మంగళవారం నోటీసులు జారీ చేసారు. పంచాయితీ నుంచి ఏవిధమైన అనుమతులు లేకుండా.. నిభందనలకు విరుద్ధంగా భవననిర్మాణం చేపడుతున్నారనే పిర్యాదులపై నోటీసులు జారీచేసినట్లు కార్యదర్శి రాజ్ కుమార్ తెలిపారు. చట్టవిరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు రుజువైతే చట్టపరమైన చర్యలుంటాయని ఆయన స్పష్టం చేసారు.

చోడమాంబికను దర్శించుకున్న ఎమ్మెల్యే విజయకుమార్

విశాలాంధ్ర-అచ్యుతాపురం : చోడమాంబిక పండుగ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మంగళవారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు . అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల పండగ

- ఎమ్మెల్యే పంచకర్ల ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పరవాడ: పెదముషిడివాడ, గొన్నవానిపాలెం, పెదతాడి గ్రామాల్లో పైడిమాంబ, బొర్రమాంబ, నకాంబికా అమ్మవార్ల పండగలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద ఎత్తున గ్రామదేవతలను దర్శించుకున్నారు. కానుకలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆయా ఆలయాల వద్ద ఉత్సవ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదం వంటివి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తదితరులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. నాయకులు పంచకర్ల ప్రసాద్, వియ్యపు చిన్న, బలిరెడ్డి అప్పారావు, కరణం నర్సింగరావు, గొన్న రమాదేవి, బుగిడి రామగోవిందరావు, సుందరపు శ్రీనివాసరావు, యల్లపు ప్రసాద్ తదితరులు అమ్మవార్లను ధర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవార్ల ఘటాలను గ్రామాల్లో ఊరేగించిన అనంతరం రాత్రికి ఆలయాల వద్దకు తీసుకొచ్చి అనుపోత్సవం చేసారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ అమ్మవార్ల ఉత్సవాల్లో మండల, గ్రామ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీఎలుపులమ్మ తల్లి పండగ మహోత్సవం

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని ఎల్లుప్పి గ్రామంలో శ్రీశ్రీ ఎలుపులమ్మ తల్లి పండగ మహోత్సవం సందర్భంగా ఎంపీటీసీ ఉగ్గని రాము లక్ష్మి దంపతుల ఆహ్వానం మేరకు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఉగ్గని రాము లక్ష్మి దంపతులు వెంకటేశ్వరరావుని గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకట రమణ, మండల పార్టీ అధ్యక్షులు కర్రీ కనకరాజు, వెంకటేశ్వరరావు , వైస్ ఎంపీపీ కొండాజి , వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీ లక్ష్మీ రాణి రాము, మామిడి శంకర్రావు , అయ్యన్నపాలెం సర్పంచ్ కనకరాజు , కర్రీ నర్సింగరావు ,బంతి కోళ్ల పద్మ, విరోత్తి ఉదయ్ కుమార్ తాటిపాముల శేఖర్, జెట్టి ప్రసాదు, దారపు కృష్ణ రామ తోట గణేష్ పాపాన ఎల్లాజీ నాయుడు పల్లి మంగరాజు, మేడపాటి రాము, కర్రీ యజ్ఞేశ్వరరావు, ఉగ్గిన హరహర కుమార్ ,ఉగ్గిన దిలీప్ ఎన్డీఏ కోటమి నాయకులు కార్యకర్తలు వీర మహిళ పాల్గొనడం జరిగింది.